

కథ 1990
2

# అద్దం

## స్వామి

అద్దం అద్దం... లోకం లోకం... లోకపు అద్దం! పలుగాకుల అద్దం! అద్దం ఆజ్ఞాపిస్తుంది. వినకపోతే వేలెత్తి చూపుతుంది.

ఫలానా బట్టలు వేసుకో అంటుంది. ఫలానా విధంగా క్రాపు మార్చమంటుంది. ఇలా నవ్వితే బావుం టావ్. ఇలా కొంచెం వారగా కళ్లు తిప్పి చూస్తే బావుం టావ్. ఇలా ఇలా... ఈ ఏంగెల్‌లోంచి చూసి ముస్తాబు చేసుకో అంటుంది. అంతా వినాలి. అది చెప్పినట్లే చేయాలి.

ఎప్పుడైనా తిక్కరేగి, 'ఇలాగే నవ్వాలా? నవ్వే ప్పుడు పెదాలు అంగుళానికి మించి సాగకూడదా? ఒక అర అంగుళం ఎక్కువగా సాగి, కొంచెం గలగలా నవ్వితేనేం? నా పై ఆఫీసరుకు కోపం వస్తుందా,' అంటూ కసిగా ప్రశ్నించి, తిరగబడి, ఆ స్వేచ్ఛలోంచి గట్టిగా నవ్వుతాను.

'నోటినిండా నవ్వుతున్నావు గనక నువ్వు ఒక పిచ్చాడు,' అంటూ గబుక్కున ఇక సీలు తీసి నా ముఖం మీద గుద్దుతుంది అద్దం! లోకపు- అద్దం!

నాకు అద్దమంటే భయం. అందుకే అది చెప్పిం దల్లా వింటాను. ఏం చెయ్యమన్నా చెయ్యడానికి సిద్ధమై పోతాను- నలుగురితో పాటు నారాయణా అంటూ నన్ను జనరలైజ్ చేసుకుని.

బజార్లో పోతుంటాను కదా, అద్దం నన్ను ఒక కంట కనిపెడుతూనే ఉంటుంది. అందుకే సారి సారికీ క్రాపు సర్దుకుంటూ, కాలర్ సవరించుకుంటూ నడు స్తాను. దారిలో పీర్ల ఊరేగింపు ఎదురై డప్పుల శబ్దం వినపడి నాక్కూడా రక్తంలోంచి ఉత్సాహం తన్నుకొచ్చి నలుగురితో పాటు కలిసి అడుగు లెయ్యాలనిపిస్తుంది. అద్దంలోకి చూస్తాను.

'ఛీఛీ! నువ్వెక్కడ? ఆ అలగా జనమెక్కడ? నక్కకూ నాగలోకానికీ ఉన్నంత తేడా! వాళ్లతో కలిసి ఎగురుతావా? ఏమైంది నీ బుద్ధి?' అంటూ అరుస్తుంది. అంతే నాకు నా సాంఘిక హోదా గుర్తొచ్చి శరీరాన్నంతా శవంలా బిగదీసుకుని ఠీవిగా అడుగులేస్తూ వెళ్లి పోతాను.

ఏదైనా పార్టీకి హాజరైనప్పుడు ఏకబిగిన అద్దంలోకే చూసుకుంటూ ఉంటాను.

'ఎంత మాట్లాడాలి? ఎంత నవ్వాలి? రిజర్వ్‌డ్‌గా కూర్చున్నానా? గంభీరంగా మాట్లాడుతున్నానా? తొడ సందులో దురద పెడితే గోక్కోకుండా జాగ్రత్త పడు తున్నానా?' అని గుంపుకు అనుగుణంగా నా వేషాన్ని దిద్దుకుంటూనే ఉంటాను.

నేను పుట్టినప్పుడు... అంటే నా గదిలో అద్దం లేన ప్పటి మాట! ఏ వేషమూ తగిలించుకోకుండా నగ్నంగా పుట్టాను. బొజ్జనిండా పాలు తాగి ఒడిలో పడుకుని, నాతో నేను ఆడుకుంటూ, నాలోకి నేను తొంగి చూసు కుంటూ, నవ్వుతూ, హాయిగా నిద్రపోయేవాణ్ణి. మరి ఇప్పుడో? ఈ దరిద్రపు అద్దం నన్ను నిద్దట్లో కూడా వదలదు. కలల కొండచిలువై వెంటాడుతుంది.

'నువ్వేం ఆకాశంలోంచి ఊడిపడ్డావా? ఎవరికీ లేని నీతి నీకు మాత్రం ఎందుకు? ఇది మంచికి కాలం కాదు. నీతి నిజాయితీ అంటూ వేలాడితే ఈ మనుషుల మధ్య బతకలేవు. మట్టికొట్టుకుపోతావు,' అంటూ బోధిస్తుంది అద్దం. 'జీ హుజూర్,' అంటాను.

నా హృదయం మరుగున పడిపోయి ఆ స్థానం లోకి ఈ లోకపు అద్దం వచ్చి ఎలా బైఠాయించిందోగాని

అప్పట్నుంచే నా కష్టాలు మొదలు, అప్పటికింకా చిన్న వయసు, అద్దంలోకి చూసి వేషం తగిలించుకోవడం ఇంకా సరిగా అలవాటు కాలేదు.

అలాంటి రోజుల్లో ఒకసారి అమ్మ- దూరపు బంధువుల ఇంటికి పోతూ నన్ను కూడా పిలుచుకు పోయింది. మేము వాళ్ల ఇంట్లో అడుగు పెట్టేప్పటికి ఒక తియ్యని వాసన నా నోట్లో నీళ్లూరిస్తూ కమ్ముకుంది. వాళ్ల వాంటింట్లో లడ్డులు తయారవుతున్నాయ్.

''అమ్మా లడ్డు! అమ్మా లడ్డు,'' అంటూ అరిచాను. అంతే. ఇల్లు చేరాక అమ్మ నన్ను ఒకటే చావ గొట్టడం-

''ఎప్పుడూ లడ్డు ముఖమే చూడనట్టు అరుస్తావేంరా లేకివెధవా! మనకు లేదా తినడానికి? వాళ్లేమనుకుంటారు? మనకు గతిలేక వాళ్ల ఇంట్లో తింటున్నామనుకోరా? ఎప్పుడు తెలుసుకుంటావురా మర్యాద, ఎప్పుడొస్తుందిరా నీకు బుద్ధి?'' అంటూ. నోట్లో నీళ్లూరుతున్నా సాధ్యమైనంత నిర్లిప్తంగా కనిపించి జితేంద్రియుడిలా పెద్దరికపు పోజులివ్వడం అప్పటికింకా నాకు తెలీదు.

''శేఖర్‌ని చూడు, ఎన్ని మార్కులు తెచ్చుకున్నాడో! సురేష్‌ని చూడు, ఎంత బుద్ధిగా ఉంటాడో! రవిగాణ్ణి చూడు, డబ్బులు ఖర్చుపెట్టకుండా ఎంత బాగా దాచుకుంటాడో....'' ఇలాగ పోల్చి పోల్చి చెప్పి చెప్పి, తిట్టి తిట్టి, తన్ని హింసించి నా అంతర్ముఖత్వం నుంచి నన్ను తప్పించి- 'నీలోకి నువ్వు తొంగి చూసుకుంటూ బతకడం కాదు, లోకపు అద్దంలోకి చూసుకుంటూ అది చెప్పినట్లు వేషాలేస్తూ నిన్ను నీవు సవరించుకుంటూ బతకడం నేర్చుకో,' అంటూ బోధించారు తల్లీ, తండ్రీ, టీచర్లూ, పెద్దలూ. సంఘం 'కీ' ఇస్తే నడిచే మరబొమ్మగా మారిపోయాను.

అద్దంలోకి తొంగిచూసి అప్పటికి అవసరమైన భావాన్ని ముఖానికి పూసుకుంటాను. సమయమూ, సందర్భమూ మారిపోగానే వెంటనే కడిగేసుకుని మళ్లీ మరో భావాన్ని ముఖానికి పులుముకుంటాను. ఇదంతా మొదట్లో ఇబ్బందిగా అనిపించేది. కాని ఇప్పుడు బాగా అలవాటుపడిపోయాను- లోకపు అద్దంలో కనిపించే పైపై జిలుగులకూ, సుఖాలకూ, అది కల్పించే సౌకర్యాలకూ, భద్రతకూ... అన్నిటికీ దాసోహమైపోయి.

కాని, అప్పుడప్పుడు అనిపిస్తూనే ఉంటుంది. 'ఉంది ఉంది... ఇంకా ఏదో ఉంది. మనిషి అద్దంలోకి చూస్తూ కల్పించుకునే ఈ సంపాదనలూ, హోదాలు, దర్జాలూ, గౌరవాలూ... వగైరాలతో అల్లుకున్న స్వార్థపు సాలెగూటి నుంచి విముక్తి చెందితే- నన్ను ఆకాశపు ఊయల్లోంచి ఆనందపు అనంతత్వంలోకి ఊపే సత్యమేదో నాలో సన్న సన్నగా జ్వలిస్తూనే ఉందని.

తండ్రికి ఇష్టమైన చదువు చదివి, తల్లికి ఇష్టమైన పిల్లను పెళ్లాడి, స్నేహితులకు ఇష్టమైన మాటలు మాట్లాడి, నా భార్యకు ఇష్టమైన డబ్బూ, నగల్నీ సంపాదించి... ఇలా అద్దం చెప్పినట్లే చేస్తూ పోతుంటే నాలో అప్పుడప్పుడూ ఏదో అశాంతి.

కాని, అద్దంలోకే తల పెట్టి చూస్తుంటే- లోకం నుంచి ఎంత ఆమోదం! ఆర్థికంగా, సాంఘికంగా నేను ఎదిగిన ఒక్కొక్క స్థాయిని చూసుకుంటే నాకెంత గర్వం! ప్రయోజకుణ్ణి అయ్యాను. అభివృద్ధిలోకి వచ్చాను. తల తిప్పి చూస్తే చేతులు నలుపుకుంటూ దణ్ణం పెట్టడానికి ఎప్పుడూ నలుగురు మనుషులు సిద్ధంగా ఉంటారు. మీటింగులు పెట్టి సన్మానాలు చేసి నన్ను ఆదర్శ పురుషుడుగా కీర్తించి చప్పట్లు కొట్టడానికి ఉవ్విళ్లూరుతుంటారు.

అద్దంలోంచి తలను బయటికి తీస్తేచాలు- ఒంటరివాణ్ణైపోతాను. మళ్లీ అశాంతి చుట్టుకుంటుంది. ఆత్మను అదిమిపట్టి లోకం మెప్పుకోసం చేసిన ఒక్కొక్క పనీ నా ఒంటరితనాన్ని పామై కరవస్తుంది.

ఇరవై నాలుగ్గంటలూ ఈ అద్దంలోకే తల దూర్చి బతకడమంటే చచ్చేచావుగా ఉంది. జీవితమంతా కృత్రిమంగా, యాంత్రికంగా, నీడగా, అబద్ధంగా మారిపోయినట్లు భయంగా తోస్తుంది.

చెట్టు- గాలికి ఊగుతున్నట్లుండదు. ఎవరో ప్రయత్నపూర్వకంగా తమ రాక్షస హస్తాలతో కుదుపుతున్నట్లుంటుంది. ఏదో బీభత్సం! నా స్వభావంలో లేని వికృతశక్తి అద్దంలోంచి ఆజ్ఞాపించి నన్ను మెడపట్టి ఆడిస్తుంది. అది చెప్పినట్లే నడచుకుని నేను చాలా సంతోషాలు కోల్పోయాను; నా స్వభావానికి విరుద్ధంగా నడచుకుని.

ఒకప్పుడు నేను కూడా ప్రేమించి పెళ్లి చేసుకోవాలనే ఆదర్శం కలిగి ఉన్నవాణ్ణే. జాతీ, రంగూ, కుల మతాలూ అన్నీ నాన్సెన్సు అని లెక్చరు దంచినవాణ్ణి. నా అదృష్టం బాగుంది నేను ప్రేమించిన స్త్రీ నన్ను కూడా ప్రేమించింది. ఇక పెళ్లి చేసుకుని చెట్టాపట్టా లేసుకుని హనీమూన్‌కు ఎగిరిపోవడమే తరువాయి. కాని అనుకోకుండా అద్దంలోకి చూశాను. అంతే. ప్రేమా, ఆరాధనా, సౌందర్యం, ప్రకృతి పూజా... అన్నీ గాలికి కొట్టుకు పోయాయి.

'నీ కులం గాని కులం పిల్లను ప్రేమిస్తావా? ఛీఛీ! ప్రేమిస్తే పరవాలేదు, పెళ్లి కూడా చేసుకుంటావా; ఛీఛీఛీ! ఆమె నా హృదయేశ్వరి, జీవితేశ్వరి, ఆమె కోసమే పుట్టాను. ఆమెనే చేసుకుతీరతాను' అని పంతం పట్టి కూర్చుంటావా; నీ చెల్లెళ్లకు పెళ్లికాదు. నీ తల్లి నుయ్యో గొయ్యో చూసుకుంటుంది. నీ తండ్రి మంచం ఎక్కుతాడు. అప్పుడు అందరికీ దూరమై నువ్వు నీ స్వప్నసుందరితో కలిసి వీథుల్లో పడి అడుక్కు తినాలి,' అంటూ బెదిరించింది. అంతటితో నా జీవితోత్సాహం క్లోజ్!

ఇంతకూ నేను చేసిన పెద్ద తప్పు - చేతులు కట్టుకుని ఏమిటి ఆజ్ఞ అన్నట్లు లోకపు అద్దంలోకి తొంగి చూడటమే!

భార్య పక్కమీదికి చేరుతుంది.

'ఈ మధ్య కొవ్వెక్కింది దీనికి. మునుపటిలా భక్తి లేదు, పతిదేవుడంటే. తాళిబొట్టు కళ్లకు అద్దుకోదు. పొద్దున్నే నా పాదాలకు ప్రణమిల్లదు,' ఇలా లోకపు అద్దంలోకే చూస్తుంటాను కదా - అద్దంలో ఆమె స్త్రీగా కనిపించదు; భార్యగా కనిపిస్తుంది. బలహీనంగా మండే కోర్కెను చల్లార్చుకోవడానికి ఆమె మీదికి ఒరుగుతాను. కాని ఆమె స్త్రీ కాదు- భార్య అనే నీడ!

నీడను కౌగిట్లోకి లాగుతాను. ఆమె నడుం నీడను వాటేస్తాను. పెదాల నీడను హత్తుకుంటాను. కాని, ఆమెలోని రక్తపు వెచ్చని స్పర్శలు అందవు. కౌగిలించుకుంటే తుమ్మమొద్దులా ఉంటుంది.

ముఖంలోకి ముఖం పెట్టి చూస్తాను. నీడ ముఖంలో నిజమైన భావం పలుకుతుందా? ఉద్రేకం పొంగుతుందా? నీడపైన ఎంత పొర్లాడీ ఏం అనుభవిస్తాను? ఎంతగా అదిమీ, నొక్కీ తడిమీ, కౌగిలించీ... నీడను అనుభవించగలనా?

నా తొలి సంతానం సంబరపడే భాగ్యం కూడా నాకు లేకపోయింది. పుట్టింది ఆడపిల్ల. లోకపు అద్దంలో తొంగిచూస్తే కనిపించింది- ఆ పాప కాదు, పెరిగి పెద్దయ్యాక ఆ పిల్ల పెళ్లికోసం కట్నకానుకలుగా కూడబెట్టాల్సిన డబ్బూ, నగలూ!

ఇంకా ఎన్నెన్ని సంతోషాలు పోగొట్టుకున్నానో ఇలా- లెక్కలేదు. అద్దంలోకే కళ్లు పెట్టీ చూస్తూ నడిచి- డబ్బు సంపాదించాలి. పెళ్లాడాలి. పిల్లల్ని కనాలి, ఇళ్లు కట్టాలి, బంగారం కొనాలి- వగైరా లోకపు విలువల్లోకి నన్ను నేను కత్తిరించుకుని ఒదిగిపోయి, అలా జీవితంలో సాధించిన ప్రయోజనకత్వాన్ని పళ్లెంలో సర్దుకు తినబోతే రంగూ, రుచీ, వాసనలే లేవు. అసలు అనుభవించాలనే ఆకలే చచ్చిపోయింది. జ్వరమొచ్చిన వాడి నాలుకలా జీవితం పట్ల ఒక అరుచి ఏర్పడిపోయింది.

సంఘం మెచ్చుకునేట్లుగా, గుర్తించేట్లుగా జీవితాన్ని డబ్బుతో మర్యాదలతో అలంకరించుకున్నంత మాత్రాన మనిషికి సుఖమూ, శాంతీ దక్కుతాయా?

అద్దం అద్దం .....

లోకం లోకం .....

లోకపు అద్దం!

పలుగాకుల అద్దం!

నా తల అద్దంలోకి ఇరుక్కుపోయింది.

నా తెలివి మోకాళ్లలోకి జారిపోయింది.

మౌనమూ, శాంతీ, ఆనందమూ అన్నీ ధ్వంసమైపోయాయి.

హృదయం బండబారింది.

చూపులు మొద్దుబారిపోయాయి.

ఒకసారి హోటల్‌లోకి పోయి టిఫిన్‌కు ఆర్డరిచ్చి కూర్చున్నాను. హోటల్ గదినిండా గోడలకు అద్దాలు! అద్దాల్లోకి చూస్తూ కూర్చున్నాను.

టిఫిన్ వచ్చింది. ప్లేటులోకి కుడిచేయి పెట్టబోతూ అద్దంలోకి చూసి చప్పున ఆగిపోయాను. ఎంత ప్రమాదం తప్పింది! కాసేపు ఆగితే ఎంత ఘోరం జరిగిపోయేది! మరోసారి చూశాను, అంతా ఎడం చేతులతో తింటూ కనిపించారు అద్దంలో. 'థాంక్‌గాడ్! బతికించావు! లోకంలో అంతా ఎడం చేతులతో తింటుంటే నేను ఒక్కణ్ణీ కుడిచేత్తో తిని నలుగురిలో నవ్వులపాలు అయిపోయేవాణ్ణి,' అనుకుని టక్కున తల వంచి గబగబా ఎడంచేత్తో తిని బిల్లు చెల్లించి బయటపడ్డాను.

కుడి ఎడమ అయింది; ఎడమ కుడిగా మారిందా? ఈ లోకపు అద్దం నా కళ్లను మోసం చేస్తోందా? నేను ఇన్నాళ్లుగా అద్దంలో వెదుక్కుంటున్న వస్తువు నిజానికి నీడేనా! సుఖం దుఃఖమేనా?

నా హృదయం నుంచీ చూపు మరల్చి పెద్ద తప్పే చేశాను. చూపుల్ని అద్దంలోకే పాతుకు కూర్చుని పెద్ద పొరపాటే చేశాను. అద్దంలో కనిపించే నా వివిధ కోణాల్ని చూసి మురిసిపోవడం తప్ప నాలోకి నేను తొంగి చూసుకుంటూ అనుభవించే నిజమైన వస్తు స్పర్శకీ, విశాలత్వానికీ దూరమైపోయాను.

అద్దంలోంచి వెనక్కి లాక్కుంటాను నా చూపులు! స్వయం ప్రకాశంతో నడుపుకుంటాను నా

బ్రతుకు. నా చూపులకు వేరు నాలోనే ఉందిగాని అద్దం లో లేదు.

మరి ఎలా? నిజాన్ని నీడగా మిగిల్చే ఈ లోకపు అద్దాన్ని వదిలించుకోవడమెలా? అద్దం వెనుక మరుగున పడిన నా హృదయాన్ని తిరిగి చేరుకోవడం ఎలా?

అద్దాన్ని దూషించాను. అద్దాన్ని ద్వేషించాను. అద్దం మీద కత్తికట్టాను. అద్దం మీద కసి పెంచుకున్నాను. కాని అద్దం నన్ను వదల్లేదు.

అద్దాన్ని తోశాను. అద్దాన్ని విసిరాను. రాళ్లతో కొట్టాను, సుత్తితో బాదాను. పగిలిపోదే అద్దం! ఏవేవో అలవాట్లతో ఆలోచనల్లతో నన్ను జిడ్డులా పట్టుకుని వేలాడుతూనే ఉంది లోకం !

వదలాల్సింది అద్దాన్ని కాదు. అద్దంలోకి కూరుకుపోయిన నా దృష్టిని.

భార్యను శాసించే భర్తనుంచీ, పిల్లల్ని హింసించే తండ్రి నుంచీ, వ్యక్తిగా ఒకరిని మోసం చెయ్యకపోయినా, వ్యాపార ధర్మం పేరిట వందలమందిని మోసం చేసే నా వృత్తి మనస్తత్వం నుంచీ నా దృష్టిని విడదీసే ప్రయత్నం చేస్తున్నాను. కానీ, చెలమలోంచీ నీరులాగా అద్దంలోంచి అంతులేకుండా ఊరుతూ వస్తున్న నా నీడలు!

శాస్త్రాలు చదివాను. గురువుల కోసం పరుగెత్తాను. అడవుల్లో తిరిగాను. సాధన చేస్తున్నాను.

ప్రస్తుతం- అద్దంలో నా నీడకు గడ్డం మొలిచింది. కాషాయ గుడ్డలు వచ్చాయి. చేతిలో రుద్రాక్ష మాల తిప్పుతోంది. కందిరీగల్లా ముసురుకునే లోకాన్ని విదిలించేస్తూ దులిపేసుకుంటూ తన చుట్టూ తనే గుండ్రంగా తిరుగుతోంది.

ఇప్పుడు అద్దంలో ఒకటే నీడ! సన్యాసి నీడ!

మోక్షమో, స్వర్గమో ఏదో సాధించాలనే ప్రయత్నమే ఇప్పుడు ఈ సన్యాసి వేషం వేసుకుని అద్దానికి నీడలా అంటిపెట్టుకుని ఉంది. లోకం నుంచీ ఇంకా ఏదో గౌరవాలూ, మర్యాదలూ పొందాలని ఆశిస్తూనే ఉంది.

నేను ప్రాణవాయువును పీల్చి బతుకుతాను, అద్దం నా నీడని పీల్చడంవల్ల బతుకుతుంది.

ఆ నీడను లాగిపారేస్తే?

దాని ప్రాణాన్ని తోడుకుని తాగేస్తే?

లాగుతున్నాను. లాగుతున్నాను... ఎంత లాగినా ఈ సన్యాసి నీడ అద్దంలోంచి బయటికి ఊడిరాదు.

అద్దంలోకి తొంగి చూసుకునే ప్రయత్నమే మానేస్తే? కాని అన్నిటినీ వదిలేసుకుంటే ఏదో వస్తుందనుకుని చేసే ప్రయత్నాన్ని ఎలా వదులుకోవడం? ఆ ప్రయత్నం ఉన్నంతవరకూ అద్దంలోకి చూసుకోవడం ఎట్లా మానడం?

నేను అద్దంలోకి తొంగిచూడని మరుక్షణం అద్దానికి అస్తిత్వం సున్న అని తెలుసు. అందుకే, అద్దంలో చివరగా మిగిలిన ఈ ఒక్కగానొక్క సన్యాసి నీడ తప్పుకుంటే చాలు!

అద్దం బద్దలైపోతుంది.

లోకం హృదయ తేజస్సులో కరిగిపోతోంది.

నేను నాలోకే తొంగి చూసుకుంటూ నీడలేని వెలుగులో అనుభవిస్తాను జీవితాన్ని!

*ఆంధ్రప్రభ వారపత్రిక, 17 జనవరి 1990*

